పివి నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్

మాజీ ప్రధాని పివికి ముఖ్యమంత్రి ఘన నివాళులు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

భారతదేశ మాజీ ప్రధాని, భారతరత్న పివి నరసింహారావు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన నివాళులర్పించారు. జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో సోమవారం పివి చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా దేశానికి పివి చేసిన సేవలను సిఎం గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డితో పాటు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాజీ ఎంపి రంజిత్ రెడ్డి తదితరులు పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. కాగా వరంగల్ జిల్లాకు చెందిన పివి ఈ దేశానికి తొమ్మిదవ ప్రధానమంత్రిగా సేవలు అందించారు. ఆయన కేంద్ర ఆర్థిక మంత్రిగా పని చేసిన సమయంలో ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చి దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి కాపాడారని తెలిపారు.

భూసంస్కరణలకు ఆద్యుడు : భట్టి విక్రమార్క

మాజీ ప్రధానమంత్రి పివి నర్సింహారావు భూసంస్కరణలకు ఆద్యులని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. పివి వర్ధంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని పివి ఘాట్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈ భూసంస్కరణలలు చరిత్రలో దేశంలో ఒక విప్లవాత్మక చర్య అని అభివర్ణించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంతో పోటీ పడేలా చేసిన ఘనత పివిదేనని తెలిపారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా చేసిన పివి పాలన నేటికి ఆదర్శమన్నారు. పివి తెలంగాణలో జన్మించడం మనందరికి గర్వకారణమన్నారు.

పివి కాంగ్రెస్ పార్టీ ఆస్తి : మహేశ్ కుమార్ గౌడ్

భారత రత్న మాజీ ప్రధాని పివి నరసింహరావు 20 వ వర్ధంతి సందర్భంగా పివి జ్ఞానభూమి వద్ద నివాళులు అర్పించిన టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పివి నర్సింహారావు కాంగ్రెస్ పార్టీ ఆస్తి అని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. పివి ఘాట్ వద్ద పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఆర్థిక సంస్కరణల పితామహుడు, అపర చాణక్యుడు, బహుభాషా వేత్త, గొప్ప సంస్కరణశీలి, మేధావి పివి నరసింహారావు చరిత్రను దేశం ఎన్నటికీ మర్చిపోదన్నారు. దివాలా అంచున ఉన్న ఆర్థిక వ్యవస్థను కాపాడిన గొప్ప ఆర్థిక వేత్త పివి అని చెప్పారు.

వార్డెన్లు, ప్రిన్సిపల్స్‌ను కాదు.. సిఎంను సస్పెండ్ చేయాలి

- సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సస్పెండ్ చేయాల్సింది ప్రిన్సిపల్, వార్డెన్లను కాదని ఏకంగా ముఖ్యమంత్రినే సస్పెండ్ చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రఖ్యాత చర్చి శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు మెదక్‌కు వచ్చిన హరీశ్‌రావు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల వద్దకు వెళ్లి వారికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిఎం రేవంత్ రెడ్డికి అల్లు అర్జున్ సమస్య ముఖ్యమైనదని అన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు రోడ్డు మీద పడినా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. చాయ్ తాగినంత సేపట్లో సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన సిఎం.. 20వేల మంది సమగ్ర శిక్షా ఉద్యోగులు రోడ్డు మీద పడితే వారితో చర్చించకుండా సమస్యలు పరిశీలించకుండా గాలికి వదిలేశారని విమర్శించారు. మాట తప్పుతున్న ముఖ్యమంత్రిని గద్దె దింపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలపై అసెంబ్లీలో నిలదీసినా ప్రభుత్వానికి పట్టింపులేదన్నారు. విద్యాశాఖకు మంత్రి లేడని అసెంబ్లీలో ఎంతమంది మాట్లాడినా ప్రభుత్వానికి చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీన్ ఛానల్ విధులన్నీ ఉత్తుత్తివేనని విమర్శించారు. ఒకటో తేదీ జీతాలు వేస్తామని ఉద్యోగులను సైతం మోసం చేశారని తెలిపారు. మాటలు కోటలు దాటుతున్నాయని, మనసు మాత్రం ఎక్కడా కదలడం లేదని విమర్శించారు. వికలాంగుల కొత్త పింఛన్ మంజూరు చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ వృద్ధాప్య పింఛన్లను ఒక నెల ఎగ్గొట్టారని అన్నారు. బడా కాంట్రాక్టర్లకు పర్సంటేజీలు తీసుకొని నిధులు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు.

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

నలుదిక్కులా అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- నగరం నడిబొడ్డున ఐటి సంస్థ నెలకొల్పడం అభినందనీయం
- ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

నలుదిక్కుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, నగరం నడిబొడ్డున ఐటీ సంస్థను నెలకొల్పడం ఇందుకు నిదర్శనమని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం హైదరాబాద్ అమీర్‌పేట మెట్రో స్టేషన్ పక్కన గల అతిపెద్ద వర్క్ స్పేస్‌లో మాల్పాని వారి ఎంపిఎం గ్రూప్ సంస్థ ఆధ్వర్యంలో నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. మంత్రి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములై ముందుకు సాగాలని తెలిపారు. నగరం నడిబొడ్డున సైతం ఐటీ సంస్థలు నెలకొల్పి అందరికీ ఉపాధి అందించడానికి కృషి చేయాలని సూచించారు. సౌత్, నార్త్, ఈస్ట్ ఆఫ్ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పెద్దఎత్తున అభివృద్ధి చేయాలనే ఆలోచనతోనే తమ ప్రభుత్వం, సిఎం రేవంత్ రెడ్డి ఉన్నారని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాల ప్రాంతాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్న కంపెనీలకు మెట్రో సదుపాయం, విమానాశ్రయానికి కొన్ని నిమిషాల్లో చేరేలా వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ ఇండస్ట్రియల్ కమిషనర్ జయష్ రంజన్, ఎంపిఎం మాల్పాని సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పనికి తగ్గ వేతనం గుర్తింపు లేదు

- వనపర్తి, గద్వాలలో ఆశా వర్కర్ల బస్సు జాతాలో స్కైలాబ్ బాబు, జయలక్ష్మి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఆశా వర్కర్ల చేత అనేక రకాల పనులు చేయిస్తూ సరైన వేతనం, గుర్తింపు ఇవ్వడం లేదని, వారిని ప్రభుత్వం ఎఎన్ఎంలుగా గుర్తించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల బస్సు జాతా సోమవారం వనపర్తి, గద్వాల జిల్లాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. వనపర్తిలోని పాలిటెక్నిక్ కళాశాల నుంచి ధర్నాచౌక్ మరికుంట వరకు బతుకమ్మలు, బోనాలతో బస్సుజాతా బృందంతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో స్కైలాబ్ బాబు, జయలక్ష్మి మాట్లాడారు. ఫిబ్రవరిలో జరగనున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లోనే ఆశా కార్యకర్తలకు ఫిక్స్ వేతనం రూ.18000 నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఫిబ్రవరి బడ్జెట్ సమావేశాల్లో ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

ప్రజాపాలన, ప్రజాస్వామ్యం అంటే ఇదేనా?

- కనీస వేతనాల సలహా మండలి బోర్డులో కొందరికే చోటు సరికాదు
- జిఒ 21ని రద్దు చేయాలి.. కార్మిక సంఘాలన్నింటికీ ప్రాతినిధ్యం కల్పించాలి
- కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ప్రతినిధులు

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

కార్మికులకు వేతనాలను నిర్ణయించడంలో కీలకపాత్ర పోషించే కనీస వేతనాల సలహామండలి బోర్డులో కేవలం రెండు సంఘాలకే ప్రాతినిధ్యం కల్పించడమేంటి? ప్రజా, ప్రజాస్వామ్యయుత పాలన, అందరి అభిప్రాయాలు తీసుకుని ముందుకు పోవడం అంటే ఇదేనా? అని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిఒ 21ని రద్దు చేసి ఆ బోర్డు కార్మిక సంఘాలన్నింటికీ ప్రాతినిధ్యం కల్పించేలా కొత్త జిఒ తీసుకురావాలని డిమాండ్ చేశారు. 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కోటి మందికి సంబంధించిన వేతనాలు పెంచకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కోటి మందికి పైగా కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తూ వారి సమస్యలపైన అనేక ఆందోళనా, పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న కార్మిక సంఘాలకు కనీస వేతనాల సలహా మండలిలో చోటు కల్పించకుండా గొంతునొక్కడం యాజమాన్యాలకు మేలు చేయడమేనని విమర్శించారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి సలహా మండలిలో సభ్యులుగా ఉన్న సంఘాలకూ ప్రాతినిధ్యం లేకుండా చేయడం అన్యాయమన్నారు. రాజకీయ నిరుద్యోగులకు పునరావాసం కల్పించేందుకు బోర్డులో సభ్యులను నియమించినట్టు ఉందనీ, బోర్డులో నియమించినవారు పోరాటాల్లోనూ లేరని గుర్తుచేశారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్ మాట్లాడుతూ.. బోర్డులో అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఐఎన్‌టియుసితో కలిసి జాతీయ వ్యాప్తంగానూ, రాష్ట్రంలోనూ బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తుంటే ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కార్మికుల, కార్మిక సంఘాల ఐక్యతను దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. కనీస వేతనాలు పెరగాలన్నా, సవరించాలన్నా జిఒలను సాధించాలంటే ఐక్యత అవసరమన్నారు. టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం మాట్లాడుతూ...సింగరేణికి సంబంధించి ఇద్దరు సభ్యులకు చోటిచ్చారనీ, మిగతా ముగ్గురికి కార్మికుల పట్ల అవగాహన లేని వారని విమర్శించారు. సెంట్రల్ గవర్నమెంట్ జిఒల ప్రకారం వేతనాలు పొందే సింగరేణి కార్మికులకు ప్రతినిధులైన వారు రాష్ట్ర కార్మికుల గురించి ఏం మాట్లాడుతారని ప్రశ్నించారు. డిఎ, బేసిక్ కలిపి కొత్త జీవో డ్రాఫ్టులు విడుదల చేయడం దుర్మార్గమన్నారు. బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్ మాట్లాడుతూ.. కార్మికుల కనీస వేతనాల కోసం వారి హక్కుల కోసం దశాబ్దాలుగా పోరాడుతున్న సంఘాల సలహాలు తీసుకునేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శించారు. ఇది కార్మిక, ప్రజా ప్రభుత్వం కాదనీ, కార్మిక వ్యతిరేక, యాజమాన్యాల అనుకూల ప్రభుత్వమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, సలహా మండలి సభ్యులను కార్మికుల ప్రయోజనాల కోసం కాకుండా ప్రభుత్వం చెప్పుచేతల్లో ఉండే విధంగా నిబంధనలకు విరుద్ధంగా నియమించిదన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివబాబు, హెచ్ఎంఎస్ జంట నగరాల అధ్యక్షులు అంజాద్ మాట్లాడుతూ...కనీస వేతనాల సలహా మండలి బోర్డునూ రాజకీయ నాయకులతో నింపడం సరిగాదన్నారు. కార్మికుల పక్షాన నిరంతం పోరాడుతున్న కార్మిక సంఘాల ప్రతినిధులకు అందులో చోటు కల్పించాలని కోరారు. ధర్నా అనంతరం అడిషనల్ కమిషనర్ గంగాధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కనీస వేతనాల సలహా మండలి మాజీ చైర్మెన్ నారాయణ, సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు విఎస్ రావు, రాష్ట్ర కార్యదర్శులు జె చంద్రశేఖర్, కూరపాటి రమేష్, టియుసిఐ నాయకులు పద్మ, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ కోటంరాజు, యాటల సోమన్న, పి సుధాకర్, అశోక్, రామ్మోహన్, కుమారస్వామి, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ప్రతినిధులు

'నాటక సినీ రచయితగా బలిజేపల్లి లక్ష్మీకాంతం సుప్రసిద్ధ'

ప్రజాశక్తి కల్చరల్

బలిజేపల్లి లక్ష్మీకాంత కవి నాటక రచయితగా సినీ రచయితగా సుప్రసిద్ధులని సాహితీ కిరణం పత్రిక సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు గుర్తు చేశారు ఆయన రచించిన సత్య హరిశ్చంద్ర నాటకం ఇప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాలులో ప్రదర్శిస్తూ వున్నారని చెప్పారు శ్రీ త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంత రావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా బలిజేపల్లి లక్ష్మీకాంతకవి యాది లో పేరిట సమావేశం జరిగింది కీలక ప్రసంగం చేసిన పొత్తూరి సుబ్బారావు దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో లోనూ గాంధీజీ పిలుపు మేర పాల్లొగ్గిన్న లక్ష్మీకాంత కవి సినీ రంగం లోనూ కథా రచయితగా నటుడు గానూ గుర్తింపు పొందారు అని వివరించారు అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ మరుగున పడిపోతున్న బలిజేపల్లి లక్ష్మీకాంతంకవి వారి గురించి తెలుసుకోవటం నేటి వారికి అవసరం అనీ ఇందువల్ల తెలుగు భాష దేశ సంస్కతి సంప్రదాయాలు అవగతం అవుతుందని చెప్పారు వేదిక పై దివ్యంగుల సంక్షేమ సంఘం జాతీయ నాయకుడు కొల్లి నాగేశ్వర రావు బింగీ నరేందర్ తదితరులు పాల్గొన్నారు

సహనం కోల్పోయా... మీడియాపై వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నా

- హైదరాబాద్ సిపి సివి ఆనంద్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ మీడియాకు క్షమాపణలు చెప్పారు. నేషనల్ మీడియాను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు సోమవారం సోషల్ మీడియాలో స్పందించారు. సంధ్య థియేటర్ ఘటనపై జాతీయ మీడియా ప్రశ్నలు అడిగినప్పుడు తాను సహనాన్ని కోల్పోయినట్లు తెలిపారు.

సంధ్య థియేటర్ వద్ద అసలేం జరిగిందో తెలుపుతూ నగర పోలీసు కమిషనర్ సివి ఆనంద్ తాజాగా ప్రెస్‌మీట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. థియేటర్‌లో ఆరోజు ఏం జరిగిందో తెలుపుతూ కొన్ని వీడియోలను విడుదల చేశారు. ఈ క్రమంలో మీడియా ఆయన్ను కొన్ని విషయాలపై ప్రశ్నించగా.. నేషనల్ మీడియా ఈ ఘటనకు మద్దతు ఇస్తుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో అక్కడ ఉన్న కొందరు జర్నలిస్టులు ఈ ఆరోపణలను తప్పుపట్టారు. తాజాగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు సివి ఆనంద్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "ఈ ఘటనపై విచారణ జరుగుతోంది. ప్రెస్‌మీట్‌లో రెచ్చగొట్టే ప్రశ్నలు వేయడంతో నేను కాస్త సహనాన్ని కోల్పోయాను. పరిస్థితులు ఎలా ఉన్నా సంయమనం పాటించాల్సి ఉంటుంది. నేను చేసింది పొరబాటుగా భావిస్తున్నాను. నేషనల్ మీడియాపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా. క్షమాపణలు కోరుతున్నా" అని తెలిపారు.

ధనుకా అగ్రిటెక్ ఆధ్వర్యంలో రైతు దినోత్సవం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

దేశానికి అన్నం పెడుతోన్న రైతులను గౌరవించడమే లక్ష్యంగా ధనుకా అగ్రిటెక్ లిమిటెడ్ కిసాన్ దివస్‌ను పురస్కరించుకొని ఘనంగా రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించించినట్లు ఆ సంస్థ తెలిపింది. మహబూబాబాద్‌లోని పల్వాల్‌లో ఉన్న ధనుకా వ్యవసాయ పరిశోధన, సాంకేతిక కేంద్రం (డార్ట్)లో నిర్వహించిన వేడుకల్లో హర్యానా రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విపుల్ గోయల్ పాల్గొన్నారని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమం ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడం, జ్ఞాన వినిమయానికి అనుకూలంగా ఉండడం, భారతీయ వ్యవసాయ భవిష్యత్తుపై ప్రముఖ శాస్త్రవేత్తలతో చర్చించడం లక్ష్యంగా ఏర్పాటు చేయబడిందని ధనుకా అగ్రిటెక్ బ్రాండింగ్ హెడ్ రత్నేష్ పాఠక్ తెలిపారు.

రూ.8440 కోట్ల అంచనాతో జిహెచ్ఎంసి వార్షిక బడ్జెట్

- మేయర్ గద్వాల విజయలక్ష్మి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వార్షిక బడ్జెట్‌కు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.8,440 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. మేయర్ అధ్యక్షతన కమిషనర్ ఇలంబర్తి సమక్షంలో సోమవారం సమావేశమైన స్టాండింగ్ కమిటీ.. బడ్జెట్ అంచనాలపై విస్త తంగా చర్చించింది. పలు విభాగాలకు సంబంధించి సభ్యులు అడిగిన సందేహాలను ఆయా విభాగాల అధికారులు నివృత్తి చేశారు. దీంతో స్టాండింగ్ కమిటీ....రూ.8,440 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది.రెవెన్యూ రాబడులు రూ.4,445 కోట్లు, రెవెన్యూ వ్యయం రూ.4 వేల కోట్లగా అంచనా వేశారు. రూ.445 కోట్ల రెవెన్యూ మిగులు చూపారు. హెచ్–సీటీ కింద రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీకి రూ.2,654 కోట్లు గ్రాంట్ రూపంలో కేటాయించినట్లు విజయలక్ష్మి పేర్కొన్నారు. 2024–25లో రెవెన్యూ రాబడులను రూ.5,938 కోట్ల నుంచి రూ. 4,052 కోట్లకు సవరించినట్లు తెలిపారు. ఆమోదిత బడ్జెట్ నుంచి ఘన వ్యర్థాల నిర్వహణకు రూ.687 కోట్లు, వీధి దీపాల కోసం రూ.186 కోట్లు, భూసేకరణ కోసం రూ.283 కోట్లు, ఎస్ఎన్‌డిపి కింద రూ.408 కోట్లు, హెచ్–సీటీ కోసం రూ.1,690 కోట్లు, గ్రీన్ బడ్జెట్‌కు రూ.344 కోట్లు కేటాయించబోతున్నట్లు మేయర్ తెలిపారు.

శ్రేయాస్‌కు మహాకుంభ మేళా ప్రకటనల హక్కులు

ప్రజాశక్తి – బిజినెస్ బ్యూరో

సేల్స్, మార్కెటింగ్ రంగంలో ఉన్న హైదరాబాద్ కంపెనీ శ్రేయాస్ మీడియా మహా కుంభ మేళా–2025 ప్రత్యేక ప్రకటనల హక్కులను పొందినట్లు ప్రకటించింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వేదికగా 2025 జనవరి 13 నుండి ఫిబ్రవరి 26 వరకు జరగనున్న ఈ కార్యక్రమానికి ఆధ్యశ్రీ ఇన్ఫోటైన్‌మెంట్‌లో భాగమైన శ్రేయాస్ మీడియా ప్రపంచంలోని అతిపెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనంలో వెండింగ్ జోన్‌లు, అమ్యూజ్‌మెంట్ జోన్, ఫుడ్ కోర్ట్‌తో సహా పలు ఇతర కార్యకలాపాల హక్కులను సైతం దక్కించుకున్నట్లు వెల్లడించింది. ఇది ప్రపంచ వ్యాప్తంగా 50 కోట్ల మంది భక్తులను ఆకర్షిస్తుందని అంచనా. ఈ దఫా భారతీయ కంపెనీలు కుంభ మేళా సందర్భంగా ప్రకటనలు, బ్రాండింగ్‌కు సుమారు రూ.3,000 కోట్లు వెచ్చించే అవకాశం ఉందని శ్రేయాస్ మీడియా వ్యవస్థాపకులు, చైర్మన్ జి శ్రీనివాస్ రావు అంచనా వేశారు. మహా కుంభ మేళా వేదికగా బ్రాండ్లను కోట్లాది మందికి చేర్చడానికి సంస్థ తనకున్న అపార అనుభవం, అసమానమైన నైపుణ్యాన్ని ఉపయోగించుకుంటుందన్నారు. 2005లో అడ్వర్టైజింగ్ ఏజెన్సీగా ప్రారంభమైన శ్రేయాస్ మీడియా 50కి పైగా బ్రాండ్స్‌ను నిర్మించిందన్నారు.

కలనరీ అకాడమీ అతిపెద్ద చెస్ బోర్డు తయారీ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

పలు వరల్డ్ రికార్డు సాధించిన కలనరీ అకాడమీ ఆఫ్ ఇండియా మరో ఘనతను సాధించింది. క్రిస్మస్ సందర్భంగా ప్రపంచంలోనే అతిపెద్ద చెస్ బోర్డును తయారు చేసింది. ఈ ఏడాది చెస్ ప్రపంచ రికార్డు ఇండియా సాధించడం స్పూర్తిగా తీసుకొని కేకుతో దీనిని తయారు చేశారు. వారం రోజుల పాటు శ్రమించి 16 అడుగుల వెడల్పు 16 అడుగుల పొడవు 256 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీన్ని రూపొందించింది. కాలనరీ అకాడమీ ఆఫ్ ఇండియా చెఫ్ అక్షయ కులకర్ణి ఆధ్వర్యంలో 25 మంది శ్రమించి దీనిని తయారు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్ట రెడ్డి, కార్యదర్శి శ్రీరామ్ వెంకటేశం, కళనరీ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్ సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు. చేయడం ఇలాంటి రికార్డులు అకాడమీ మరిన్ని సాధించాలని బాలకిష్ట రెడ్డి ఆకాంక్షించారు. ఇప్పటికే ఐదు వరల్డ్ రికార్డులు సాధించామని సుధాకార్ రావు తెలిపారు.

ఎస్‌హెచ్‌జిలకు సోలార్ పవర్ ప్లాంట్లు

- 150 ఎలక్ట్రిక్ బస్సుల ఏర్పాటుకు అవకాశం
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని స్వయం సహాయక బృందాలకు (ఎస్‌హెచ్‌జీ) సోలార్ పవర్ ప్లాంట్లను ఇవ్వడానికి వీలుగా వెంటనే చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పలు పథకాలపై సోమవారం సచివాలయంలో సిఎస్ సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలిదశలో ఐదు జిల్లాల్లోని 231 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా రానున్న ఆరునెలల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కాళీగా ఉన్న దేవాదాయ భూములను లీజుకు తీసుకొని ఎంపిక చేసిన మహిళా గ్రూపులకు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళా సంఘాల సభ్యులను కోటీశ్వరులను చేయాలన్న ప్రభుత్వ సంకల్పంలో భాగంగా, మహిళా సంఘాలకు 150 ఎలక్ట్రిక్ బస్సులను తొలివిడతలో అందించాలని సూచించారు. వాటి నిర్వహణా బాధ్యతలను తెలంగాణ ఆర్టీసీ కి అప్పగించాలని పేర్కొన్నారు. వివిధ జిల్లాల్లోని సమాఖ్య భవనాల నిర్మాణాలను జూన్ లోపు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాదాపూర్‌లోని ఇందిరా మహిళా శక్తి బాజార్‌లో జనవరి 25 లోగా 'సరస్ మేళా' నిర్వహించడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమీక్షలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యదర్శి లోకేష్ కుమార్, కమిషనర్ శ్రీజన, సెర్ప్ సీఈఓ దివ్య తదితరులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF XII ADDL. DISTRICT JUDGE AT : VISAKHAPATNAM
I.A.546/2024 in O.S.32/2009

Between:
Sri Tumati Anjaneyulu Petitioner/Plaintiff
And
Podagatlapalli Kameswara Rao & 5 others ...Respondents/Defendants

NOTICE

To, **Respondent/Defendant No.6:**
Smt. Mulukutla Sujatha,
W/o. Late Satyanarayana Sarma, Hindu, aged 64 years, Household Duties, R/at C/o. M.V. Somayajulu, H.No.12-1331/41, Dattatreya Colony, Asif Nagar Post, Hyderabad-500078.

Please take notice that the above matter is filed by the plaintiff against the defendants No.1 to 6 for Specific Performance of Contract. Whereas the above said I.A.546/2024 is filed by the petitioner/plaintiff for amendment of the pleadings in the above suit. Whereas the above matter is stands posted to **07-01-2025** for appearance of above said respondent/defendant No.6 before the above said Hon'ble Court without fail, personally or through Advocate before the above said Hon'ble Court at **10:30 A.M.**, failing which the matter will be decided in your absence by doing set exparte.

R.K. MISRO, Advocate
Visakhapatnam
Cell : 9393112360.

IN THE HON'BLE COURT OF XII ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
O.S.32/2009

Between:
Sri Tumati Anjaneyulu ...Plaintiff
And
Podagatlapalli Kameswara Rao & 5 others ...Defendants

SUMMONS

To, **Defendant No.6:**
Smt. Mulukutla Sujatha,
W/o. Late Satyanarayana Sarma, Hindu, aged 64 years, Household Duties, R/at C/o. M.V. Somayajulu, H.No.12-1331/41, Dattatreya Colony, Asif Nagar Post, Hyderabad-500 078.

Please take notice that the above matter is filed by the plaintiff against the defendants No.1 to 6 for Specific Performance of Contract. Whereas the above matter is stands posted to **07-01-2025** for appearance of above said defendant No.6 before the above said Hon'ble Court without fail, personally or through Advocate before the above said Hon'ble Court at **10:30 A.M.**, failing which the matter will be decided in your absence by doing set exparte.

R.K. MISRO,Advocate
Visakhapatnam
Cell: 9393112360.

BEFORE THE XI ASSISTANT CITY CIVIL COURT AT CHENNAI
OS.NO. 4604 of 2024

M/s. Skyec Drugs and Pharmaceuticals Pvt. Ltd
Represented by its Authorized Signatory, Shyam Durairaj, Marketing Manager Office bearing No, RAM- L1, Guindy Industrial Estate, SIDCO Industrial Estate, Guindy, Chennai, Tamil Nadu- 600032. **... Plaintiff**

Vs

Siddu Veterinary Medical Agency Wholesale and Retail,
15-2/1, Main Road, Alair, Yadadri, Telangana - 508101. **...Defendant**

NOTICE

Please take notice that the above-mentioned plaintiff has filed a suit seeking to recover a sum of Rs.1,02,846/- (Rupees One Lakh Two Thousand and Eight Forty-Six Only) along with interest @ 18% wef from the date of filing to the date of realization of the amount. The said suit came up for hearing before the Hon'ble XI Asst City Civil Court at Chennai on 10/12/2024. The Hon'ble Court was pleased to order Paper Publication for the defendant/Siddu Veterinary Medical Agency Wholesale and Retail, returnable by 08/01/2025. Therefore, you the defendant/Siddu Veterinary Medical Agency Wholesale and Retail is hereby informed to be kindly present in the Hon'ble Court on 08/01/2025 at 10.30 am either in person or through your advocate failing which matter would be decided in your absence on merits.

S.Suresh Kumar,
Counsel for the Plaintff.

Utkarsh Small Finance Bank
Aapki Ummeed Ka Khaata
(A Scheduled Commercial Bank)

జోనల్ ఆఫీస్: డోర్ నెం.7-1-24/2/సి, 5వ అంతస్తు, ధాన్సి సురభి కాంప్లెక్స, గ్రీన్స్‌ల్యాండ్స్, బేగంపేట్, హైదరాబాద్-500016
రిజిష్టర్డు ఆఫీస్: ఉత్కర్ష్ టవర్, ఎన్‌హెచ్-31 (ఎయిర్‌పోర్ట్ రోడ్), సెహ్మల్‌పూర్, కాజీసరాయ్, హర్హువా, వారణాసి, యుజి-221105.

స్థిరాస్తి కోసం స్వాధీనతా ప్రకటన

ఇందమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా దిసెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (సెక్యూరిటీ) ఇంటరెస్ట్ చట్టం,2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ అధీకృత అధికారి సదరు నోటీసు తేదీ నుండి 60రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తం తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ దిగువ పేర్కొన్న తేదిన డిమాండ్ నోటీసు జారీచేసినారు.
రుణగ్రహీతలు మెత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ సంతకందారు సదరు రూల్స్‌లోని రూల్8తో చదువగల సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో దిగువ వివరించిన ఆస్తిని దిగువ పేర్కొన్న తేదీన **స్వాధీనంలోకి** తీసుకున్నారు.
ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా, ఆస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపదలచిన వారు **ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్** వారికి దిగువ వివరించిన బకాయి మొత్తం మరియు దానిపై వడ్డీని చెల్లించుటకు లోబడి ఉంటుంది.
సెక్యూర్డు ఆస్తుల విమోచనానికి అందుబాటులోగల సమయానికి సంబంధించి చట్టంలోనిసెక్షన్13, సబ్–సెక్షన్ (8) నియమాల క్రింద రుణగ్రహీత శ్రద్ధను కోరుతున్నారు.

క్ర. సం.	బ్రాంచ్ పేరు	ఖాతా పేరు	రుణగ్రహీత/ హామీదారు పేరు (ఆస్తి యజమాని)	డిమాండ్ నోటీసు తేది	స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేది నాటికి బాకీపడిన మొత్తం
1	హైదరాబాద్	154214000 0006762	వేముల లక్ష్మీ పార్వతి (రుణగ్రహీత), వేముల విష్ణు (సహ–రుణగ్రహీత & తాకట్టుదారు)	27/09/2024	20/12/2024 లాంఛనప్రాయ	₹ 8,76,839.92/-
ఆస్తి/ల యొక్క వివరణ: గ్రామం & గ్రామ పంచాయితీ ఏ.గోకవరం, మండలం–ఉంగుటూరు, ఎస్ఆర్‌ఓ భీమడోలు, జిల్లా –ఏలూరు (ఆం.ప్ర)లోని ఆర్ఎస్ నెం. 75/3, డోర్ నెం.1–56 వద్దగల ఆస్తి మొత్తం భాగం. విస్తీర్ణపు ఏరియా–162 చ.గ.లు. ఆస్తి సరిహద్దులు: తూర్పు: ఆకుల శ్రీనుకు చెందిన 39అ.ల ఇంటి స్థలం, పడమర: 42 అ.ల పంచాయితీ రోడ్, ఉత్తరం: మిద్దెశ్రీనుకు చెందిన 40అ.ల ఇంటి స్థలం, దక్షిణం: బొర్రా శ్రీరాములుకు చెందిన 32అ.ల ఇంటి స్థలం.						
2	హైదరాబాద్	154214000 0006783	బక్క శ్రీనివాస రెడ్డి (రుణగ్రహీత తాకట్టుదారు) బక్క అరుణ కుమారి (సహ–రుణగ్రహీత)	08/01/2024	21/12/2024 లాంఛనప్రాయ	₹ 11,37,821/-
ఆస్తి/ల యొక్క వివరణ: డోర్ నెం.30–10, సర్వే డి.నెం.402/2, బ్లాక్ 30, గ్రామం& మండలం–చీరాల, పంచాయితీ –కొత్తపాలెం, ఉప జిల్లా– చీరాల, పాత జిల్లా–ప్రకాశం, కొత్త జిల్లా –బాపట్ల (ఆం.ప్ర)–523167 లోగల ఆస్తి మొత్తం భాగం. విస్తీర్ణపు ఏరియా 919.6 చ.గ.లకుగాను 689.7 చ.గ.లు. ఆస్తి సరిహద్దులు: తూర్పు: బక్క శివప్రసాద్ రెడ్డి స్థలం, పడమర: నక్కా సాంబయ్య స్థలం, ఉత్తరం: బక్క శ్రీనివాస రెడ్డి స్థలం, దక్షిణం: రోడ్డు.						
3	హైదరాబాద్	154214000 0006528	మల్లారపు రమాదేవి (రుణగ్రహీత & తాకట్టుదారు), మల్లారపు నరహరి నాగార్జునరాజు (సహ–రుణగ్రహీత)	05/08/2024	21/12/2024 లాంఛనప్రాయ	₹ 5,83,253.09/-
ఆస్తి/ల యొక్క వివరణ: పేరలి గ్రామం, తుమ్మలపల్లి గ్రామ పంచాయితీ, కర్లపాలెం మండలం, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, గుంటూరుజిల్లా (ఆంధ్రప్రదేశ్)–522111లోని సర్వే డి.నెం.805/17, డోర్ నెం.14–37 లోగల ఆస్తి మొత్తం భాగం. విస్తీర్ణపు ఏరియా 435.6 చ.గజాలు. ఆస్తి సరిహద్దులుగా: తూర్పు: గూడూరు విష్ణు స్థలం 42 అ.లు, పడమర: మల్లారపు గోపి స్థలం–51అ.లు, ఉత్తరం: 4 అ.ల వెడల్పు వెడల్పు మార్గం మరియు మల్లారపు భూదేవి స్థలం–85 అ.లు, దక్షిణం: గొర్ల వీరాస్వామి స్థలం–84 అ.లు.						
4	హైదరాబాద్	154214000 0006831	వీర రాఘవయ్య పీట (రుణగ్రహీత &తాకట్టుదారు) పీత కళ్యాణి (సహ–రుణగ్రహీత)	03/10/2024	21/12/2024 లాంఛనప్రాయ	₹ 4,97,208.80/-
ఆస్తి/ల యొక్క వివరణ: డిండి గ్రామం, డిండి గ్రామపంచాయితీ, నిజాంపట్నం మండలం, రేపల్లి సబ్–జిల్లా, బాపట్ల జిల్లాలోని సర్వే డి.నెం.400/7, న్యూ డోర్ నెం.3–139 దగ్గరలోని ఒపెన్ ప్లాట్‌గల ఆస్తి మొత్తం భాగం. విస్తీర్ణం:291 చ.గ.ల ఖాళీసైటు అన్ని హక్కులతో కూడినది. ఆస్తి సరిహద్దులుగా : తూర్పు: గుడిపాల్ శ్రీనివాస రావు మిగతా ఆస్తి, పడమర: దొందుప్రోలు నాగరాజు ఆస్తి, ఉత్తరం: పంచాయతీ రోడ్డు, దక్షిణం: మన్యం వెంకటేశ్వరరావు ఆస్తి.						

తేదీ: 24-12-2024
ప్రదేశం: హైదరాబాద్

సం/–
(అధీకృత అధికారి)
ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

డిటెన్షన్ విధానం అమలైతే డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదం

- పేదలకు విద్య దూరమవుతుంది : టిఎస్‌యుటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ఐదు, ఎనిమిది తరగతుల్లో డిటెన్షన్ విధానం అమలైతే ప్రభుత్వ విద్యాసంస్థల్లో డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదముందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేసన్ (టిఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల పేదలకు విద్య దూరమవుతుందని తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఆరు నుంచి 14 ఏళ్ల వయస్సు వరకు బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యను అందించాల్సి ఉంటుందని తెలిపారు. ఎనిమిదో తరగతి వరకు ఏ ఒక్క విద్యార్థినీ ఫెయిల్ లేదా నిలుపుదల చేయకూడదని వివరించారు. కానీ కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం పేరుతో విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేసినట్టు కనిపిస్తోందని విమర్శించారు. 2018లోనే కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదన తీసుకు రాగా ఆనాడే టిఎస్‌యుటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకించిందని గుర్తు చేశారు. అప్పటి తెలంగాణ ఉపముఖ్యమంత్రి, విద్యా మంత్రి కడియం శ్రీహరి రాష్ట్రంలో డిటెన్షన్ విధానాన్ని అమలు జరపబోమని ప్రకటించారని తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వమూ డిటెన్షన్ విధానాన్ని తిరస్కరించాలని డిమాండ్ చేశారు.

ఆస్తి కోసం.. తమ్ముడిని చంపిన అక్కకు యావజ్జీవ శిక్ష

- తీర్పు వెల్లడించిన రంగారెడ్డి జిల్లా కోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆస్తి కోసం సొంత తమ్ముడిని కొట్టి చంపిన అక్కకు రంగారెడ్డి జిల్లా కోర్టు సోమవారం యావజ్జీవ శిక్ష విధించింది. షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని బోడం పహాడ్ గ్రామానికి చెందిన అమడపురం నర్సింహులుకు కూతురు అరుణమ్మ, కుమారుడు బాల్‌రాజు ఉన్నారు. ఆరుణమ్మకు పదేళ్ల క్రితం కంకల్‌కు చెందిన కర్రె లక్ష్మయ్యతో వివాహం జరిగింది. బాలారాజ్‌కు లక్ష్మీతో వివాహ జరిగింది. తండ్రి ఆస్తిలో వాటా కావాలంటూ 2014 మార్చి 3న సోదరుడితో అక్క గొడవ పడింది. ఈ తగాదాలో తండ్రి సైతం కూతురు పంతన చేరి వారిద్దరూ బాల్‌రాజ్‌పై దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాలరాజ్‌ను నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ఇరు పక్షాల వాదనలు విన్న రంగారెడ్డి జిల్లా కోర్టు బాల్‌రాజు హత్యకు కారణమైన అరుణమ్మకు యావజ్జీవ జైలు శిక్షతోపాటు రూ. ఐదు వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్టు పోలీసులు తెలిపారు. హత్యకు కారణమైన మరో వ్యక్తి నర్సింహులు గతంలోనే మరణించారు.

కెసిఆర్, హరీశ్ రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హైకోర్టులో సోమవారం క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. మేడిగడ్డ నిర్మాణంలో అవినీతి జరిగిందన్న అంశంపై భూపాలపల్లి కోర్టు ఇచ్చిన నోటీసులను కొట్టివేయాలని కోరారు. మేడిగడ్డ నిర్మాణంలో అవినీతి జరిగిందంటూ గతంలో భూపాలపల్లి కోర్టులో ప్రైవేట్ పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం గత జులై 10న కెసిఆర్, హరీశ్‌రావుకు నోటీసులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో కోర్టు ఇచ్చిన నోటీసులను కొట్టివేయాలని కోరుతూ తాజాగా క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు.

'భగీరథ'కు టోల్ ఫ్రీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి సర్కారు ముందడుగేసింది. వేసవికి మూడు నెలల ముందుగా స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించే ప్రయత్నం చేస్తున్న పంచాయతీరాజ్ శాఖ, తాజాగా టోల్‌ఫ్రీ నెంబరును కేటాయించింది. పల్లెల్లో తాగునీటి ఇబ్బందులు ఉంటే 1800-599-4007 నెంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించింది. ఇందుకుగాను ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఎస్‌ఈ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల బృందాన్ని పర్యవేక్షణ కోసం నియమించింది. సోమవారం నుంచే ఈ టోల్ ఫ్రీ నెంబరు అమల్లోకి వచ్చింది. తొలి రోజు ఆయా జిల్లాల నుంచి తొమ్మిది ఫిర్యాదులు అందాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులు, సమస్యలపై ఎప్పటికప్పుడు సర్కారు దృష్టికి తీసుకుపోయే అవకాశం కలిగింది. 24 గంటల పాటు కాల్ సెంటర్ పనిచేయనుంది. పగటిపూట వచ్చే ఫోన్ కాళ్లను భగీరథ కార్యాలయం సిబ్బంది అటెండ్ చేసి వివరాలు నమోదు చేసుకుంటారు. రాత్రి వచ్చే కాల్స్ రికార్డు అవుతాయి. ప్రతిరోజూ వచ్చే ఫిర్యాదులను మిషన్ భగీరథ ఇంజనీర్ ఇన్ ఛీఫ్ కృపాకర్‌రెడ్డి సమీక్షించి 24 గంటల్లో సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటారు.

రైతాంగం పట్ల కేంద్రం విధానాలు మార్చుకోవాలి

- తన విధానాలను రాష్ట్రాలపై బలవంతంగా రుద్దే యత్నం
- సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర నాయకులు బి.వెంకట్
- కేంద్ర వ్యవసాయ మార్కెటింగ్ ప్రతుల దహనం

మార్కెట్ విధానం ప్రతులను దగ్ధం చేస్తున్న కిసాన్ మోర్చా నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతాంగం పట్ల కేంద్ర ప్రభుత్వం విధానాలు మార్చుకోవాలని, లేదంటే ప్రతిఘటన తప్పదని సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర నాయకులు బి వెంకట్ అన్నారు. ఎస్‌కేఎం దేశవ్యాప్త పిలుపులో భాగంగా హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ వద్ద నిరసన తెలిపారు. కేంద్ర వ్యవసాయ మార్కెట్ విధానం ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా బి వెంకట్ మాట్లాడుతూ.. మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తెచ్చిన మోడీ ప్రభుత్వం రైతుల పోరాటంతో వెనక్కి తగ్గినా.. చాప కింద నీరులా మళ్లీ అమలు చేయడానికి పూనుకుందన్నారు. మార్కెట్ చట్టాలను రాష్ట్రంలో రూపొందించుకుంటే మద్దతు తెలుపుతామని కేంద్రం అనడం హాస్యాస్పదం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల మీద బలవంతంగా రుద్దే ప్రయత్నం జరుగుతోందన్నారు. కేంద్రం చేసిన విధానాన్ని రాష్ట్రాలు అమలు చేస్తే పంటలు, సాగు విస్తీర్ణం తగ్గుతుందని, ఆత్మహత్యలు పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. రైతు సంఘాల నేతలకు రాత పూర్వకంగా ఇచ్చిన ఏ హామీనీ నెరవేర్చకపోగా, ఓ రైతు నాయకుడు 28 రోజులుగా నిరాహార దీక్ష చేస్తుంటే పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్లు టి సాగర్, పశ్యపద్మ మాట్లాడుతూ.. కేంద్రం కార్పొరేట్లకు అనుకూలంగా విధానాలను రూపొందిస్తోందని అన్నారు. నోయిడాలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టారని.. మోడీ ప్రభుత్వం ఈ కేసులన్నింటినీ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ల ముసాయిదాను ఉపసంహరించుకోవాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. రైతులకు రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇప్పటివరకు ఏం చేశారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే పోరాటాలను తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్లు విస్సా కిరణ్, బి.రాము, వస్కుల మట్టయ్య, సదానందం, ప్రసాద్, కార్మిక సంఘాల నాయకులు ఎస్.వి రమ, నాయకులు ఆర్.వెంకటరాములు, శంకర్, కొండల్, ప్రభులింగం, బి.ప్రసాద్, మూడ్ శోభన్, బొప్పని పద్మ, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు, డివైఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

భువనగిరి కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ సోమవారం యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట రైతులు పెద్దఎత్తున దర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. త్రిబుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను వెంటనే మార్చాలని కోరారు. రాయగిరి ప్రాంతం నుంచి బస్వాపురం రిజర్వాయర్ కాలువలు, వరంగల్ హైవే ప్రధాన రహదారి వెడల్పు, హైఓల్టేజీ విద్యుత్ లైన్లతోపాటు త్రిబుల్ ఆర్‌తో ఈ పరిసర ప్రాంతాల్లో రైతులకు భూమి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అలైన్‌మెంట్‌ను మార్చి రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తంగెళ్లపల్లి రవికుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజుగౌడ్, రైతులు అవిశెట్టి పాండు యాదవ్, చౌటుప్పల్ సింగిల్‌విండో చైర్మెన్ చింతల దామోదర్‌రెడ్డి, గడ్డమీది మల్లేష్, డి.రాములు, దశరథ, గిరి, భోగయ్య, ఐలయ్య, ధర్మయ్య, రైతులు పాల్గొన్నారు.

అల్లు అర్జున్ ఇంటిపై దాడి కేసులో.. నిందితులకు బెయిల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సినీ హీరో అల్లు అర్జున్ ఇంటి వద్ద ఒయు జెఎసి పేరుతో దాడి చేసిన నిందితులకు బెయిల్ మంజూరైంది. జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఒయు జెఎసి పేరుతో కొందరు అల్లు అర్జున్ ఇంట్లోకి ప్రవేశించి పూల కుండీలను, కుర్చీలను ధ్వంసం చేశారు. అలాగే, ఇంటిపైకి టమాటాలు విసిరారు. దాడిలో పాల్గొన్న ఆరుగురు నిందితులను జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిపై బీఎన్ఎస్ 331(5)190,191(2)292,126(2)131 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. యూత్ కాంగ్రెస్ కొడంగల్ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ప్రేమ్ కుమార్ గౌడ్, శ్రీనివాసు మొవ్వ, నాగరాజు, నరేష్ ప్రకాష్ ప్రత్యక్షంగా దాడిలో పాల్గొన్నట్టు గుర్తించారు. ఓయూ జేఏసీ ముసుగులో కాంగ్రెస్ కార్యకర్తలు అల్లు అర్జున్ ఇంటిపై దాడి చేసినట్టు పోలీసులు నిర్ధారించారు. ఆరుగురిని జూబ్లీహిల్స్ పోలీసులు సోమవారం వనస్థలిపురంలోని న్యాయమూర్తి నివాసంలో హాజరుపరిచారు. వారికి న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. ఒక్కొక్కరు రూ.5వేల చొప్పున పూచీకత్తు సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

- అంబేద్కర్‌పై వ్యాఖ్యలతో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల గుండెల్లో గాయం
- దీపాదాస్ మున్షి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి నాయకులు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని ఎఐసిసి తెలంగాణ ఇంచార్జ్ దీపాదాస్ మున్షి డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తదితర నాయకులతో కలిసి ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆ వ్యాఖ్యలతో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల గుండెల్లో గాయమైందన్నారు. ఇది కేవలం ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల విషయం కాదని, ఆ వర్గాలు అంబేద్కర్‌ను దేవుడిగా భావిస్తున్నారని చెప్పారు. తక్షణం అమిత్ షా రాజీనామా చేసి ప్రజలను క్షమాపణ కోరాలన్నారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా 'అంబేద్కర్ సమ్మాన్ సప్తాహ" నిర్వహిస్తున్నాం. ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్‌లో, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి, అమిత్ షాని బర్తరఫ్ చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్లను కలుస్తామని చెప్పారు.

రాజ్యాంగాన్ని బిజెపి తొలగించాలనుకుంటున్నదని అమిత్ షా వ్యాఖ్యలతో మరోసారి బట్టబయలైందని విమర్శించారు. అవినీతిపై చర్చించమంటే దారి మళ్లించేలా ఇలాంటి అంశాలు మాట్లాడుతున్నారని తెలిపారు. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై తాము నిలదీస్తే అదంతా రాజకీయమంటూ తప్పించుకున్నారని రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనలను గుర్తుచేశారు. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. కేంద్ర క్యాబినెట్ నుంచి అమిత్ షాను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంటు అత్యున్నత వ్యవస్థ అని తెలిపారు. రాహుల్ గాంధీ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా హత్యాయత్నం కేసు నమోదు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సిడబ్ల్యూసి సభ్యులు కొప్పుల రాజు మాట్లాడుతూ దేశ పౌరులు అంబేద్కర్‌ను దేవునిగా చూస్తుంటే ఆ దేవునిపై అమిత్ షా ద్వేషంతో మాట్లాడారని విమర్శించారు. అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించిదంటూ ప్రధాని మోడీ చేసిన ఆరోపణలను తిప్పికొట్టారు. అంబేద్కర్‌ను డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా ఎన్నుకుంది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తుచేశారు. కాంగ్రెస్ చేసిన రాజ్యాంగ సవరణలు పేద ప్రజలకు ఉపయోగపడ్డాయని తెలిపారు.

అమర రాజా బ్యాటరీ కంపెనీ భవనంలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో నిర్మాణంలో ఉన్న అమరరాజా బ్యాటరీ కంపెనీలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దాంతో కార్మికులు ఒక్కసారిగా భయాందోళనలకు గురై బయటకు పరుగులు తీశారు. పోలీసులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. అమర రాజా బ్యాటరీ నిర్మాణంలో ఉంది. ఇందులో సుమారు 150 మంది కార్మికులు పనిచేస్తున్నారు. సోమవారం ఒక్కసారిగా మూడో అంతస్తులో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దాంతో కార్మికులు బయటకు పరుగులు తీశారు. వెంటనే పోలీసులకు, అగ్నిమాపక దళ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మత్స్య మిత్ర గ్రూపులను పునరుద్ధరించాలి

- ప్రతీ మహిళా సొసైటీకి రూ. పది లక్షల రుణాలివ్వాలి
- మత్స్య మహిళల రాష్ట్ర సదస్సులో లెల్లెల బాలకృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత్స్య మిత్ర గ్రూపులను పునరుద్ధరించి, ప్రతీ మహిళా సొసైటీకి రూ. 10 లక్షల రుణాలివ్వాలని అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక సమాఖ్య జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, తెలంగాణ మత్స్యకార్మికులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మత్స్యకారులు మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీ హైదరాబాద్ జిల్లా చైర్‌పర్సన్ కొప్పు పద్మ అధ్యక్షతన మత్స్య మహిళల రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వంద శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వాలనీ, యాభై ఏండ్లు నిండిన మత్స్య మహిళలకు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మత్స్య మహిళలు గత అనేక సంవత్సరాలుగా మహిళా సొసైటీలు ఏర్పాటు చేసుకొని రోడ్లపైనే చేపలమ్ముతూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. దీంతో పాటు గత ప్రభుత్వం నూతన మత్స్య మహిళ సొసైటీలను ఏర్పాటు చేసి గాలికి వదిలేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా వారి డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సొసైటీలు ఏర్పాటైనప్పటి నుంచి మహిళలకు ఎలాంటి రుణాలు అందలేదని తెలిపారు. చేపల మార్కెట్లలో మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలనీ, మత్స్య మహిళలకు చేపల వంటకాలపై అలంకరణ చేపల ఉత్పత్తిపై ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతీ జిల్లా, మండల కేంద్రాల్లో హోల్ సేల్ చేపల మార్కెట్లను నిర్మించాలని డిమాండ్ చేశారు.వాటి నిర్వహణ భాద్యత స్థానిక మత్స్య మహిళా సొసైటిలకు నామ మాత్రపు లీజుకు ఇవ్వాలని కోరారు. మత్స్య సొసైటీ సభ్యురాలికి ప్రసూతి సమయంలో రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కన్వీనర్ గాండ్ల అమరావతి, మేడ్చల్ జిల్లా కన్వీనర్ బక్కి బాలమణి, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ కాగు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల నిరసన

- వేతనాలు పెంచాలని డిమాండ్
- పర్మినెంట్ కార్మికులతో సమానంగా పని.. సౌకర్యాల్లో తేడాపై ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రు స్టేడియంలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని, ప్లకార్డ్స్ పట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం ఆర్జీ-1 జిఎం లలిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి వేల్పుల కుమారస్వామి మాట్లాడుతూ.. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు తగిన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి నినాదం ఒకే కుటుంబం, ఒకే గమ్యం, ఒకే లక్ష్యం చదవడానికి బాగుంది కానీ ఇందులో కాంట్రాక్ట్ కార్మికులకు చోటులేదన్నారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పని చేస్తున్నప్పటికీ వేతనాల్లో తేడాలున్నాయని, క్వార్టర్లు కేటాయించడంలో వివక్ష ఉందని అన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు ఖాళీ క్వార్టర్లు కేటాయించాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేదరి సారయ్య, పి.రాజు, సిహెచ్.ఉపేందర్, ఇండ్ల ఓదెలు, నాయకులు టి.నరహరి రావు, చంద్రయ్య, కిరణ్, రాజయ్య, అంజి, వినోద, ప్రసాద్, ఖాళీ, జీన, చిలకమ్మ, శాంతి, కుమారి, లక్ష్మీ, శ్రీను, రఘు, రాజేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి ఆటో డ్రైవర్ హల్ చల్

- పోలీసులు తనకు న్యాయం చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తనపై అకారణంగా దాడి చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదంటూ ఓ ఆటో డ్రైవర్ సెల్ టవర్ ఎక్కి రెండు గంటల పాటు హల్‌చల్ చేశాడు. ఈ ఘటన సోమవారం నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని అయిటిపాముల గ్రామశివారులో జరిగింది. వివరాల్లోకి వెళితే.. చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన చిలుముల చింతాలు ఆటో డ్రైవర్. నాలుగు రోజుల కిందట తన ఆటోలో ప్రయాణీకులను ఎక్కించుకొని నకిరేకల్ వెళ్తుండగా పట్టణంలో కొంత మంది వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆదే రోజు చింతాలు నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నాలుగు రోజులైనా పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో ఆవేదన చెందిన చింతాలు.. అయిటిపాముల గ్రామశివారులోని జాతీయ రహదారి పక్కన ఉన్న సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. విషయం తెలుసుకున్న కట్టంగూర్ ఎస్ఐ రవీందర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని న్యాయం చేస్తామని నచ్చజెప్పడంతో కిందికి దిగాడు. చింతాలును నకిరేకల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.

రివేంజ్ సిఎం.. రివర్స్ పాలిటిక్స్

- ప్రతీకార పాలనకు తెరలేపిన రేవంత్
- ప్రజల దృష్టి మళ్లించడానికే తెరమీదికి అల్లు అర్జున్ వ్యవహారం : కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రివేంజ్ సిఎంగా మారి రివర్స్ పాలిటిక్స్ నడుపుతున్నారని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. ప్రతీకార రాజకీయాలే లక్ష్యంగా ప్రతిపక్షాలను అనగదొక్కడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆమె మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బిజెపి కలిసి పనిచేస్తున్నాయని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ దాన్ని బిజెపి నడిపిస్తోందని విమర్శించారు. ఢిల్లీలో సిఎం రేవంత్ రెడ్డి బిజెపి పెద్దలను కలిసిన తర్వాతే కెటిఆర్‌పై ఎసిబి కేసు నమోదైందని, ఆ మరునాడే ఇడి కేసు నమోదు చేసిందని గుర్తు చేశారు. ప్రాంతీయ పార్టీలను కనుమరుగు చేయాలన్నది కాంగ్రెస్, బిజెపిల లక్ష్యమని తెలిపారు. దేశంలో బలమైన ప్రాంతీయ పార్టీకి నాయకునిగా ఉన్న కేసీఆర్ వంటి నేతలను దెబ్బకొట్టేందుకు రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ప్రజలకిచ్చిన హామీలు, సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికే అల్లు అర్జున్ వ్యవహారాన్ని ప్రభుత్వం తెరమీదికి తీసుకొచ్చిందని అన్నారు. రాష్ట్రంలో పది శాతం కమిషన్ ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించారు. మెఘా కృష్ణారెడ్డి వంటి వారి కంపెనీలకు వేల కోట్ల రూపాయల బిల్లులు చెల్లిస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్, పేదల సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు మాత్రం నిధులు విడుదల చేయక పోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గురుకులాల్లో విషాహారం తిని మరణించిన 57 మంది పిల్లల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కాకపోవడం వల్ల అనేక మంది రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భూభారతితో భూభద్రత ఉండబోదనీ, ఈ చట్టాన్ని తెచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను నాశనం చేస్తున్నదని విమర్శించారు. ధరణిపై విషప్రచారం చేశారని, ప్రజలు తిరిగి ఆ వ్యవస్థనే కావాలని ఉద్యమించే పరిస్థితి వస్తుందని తెలిపారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దాన్ని అడ్డుకునేందుకు గ్రామ గ్రామానా ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతిష్టిస్తామని పునరుద్ఘాటించారు. తెలంగాణ జాగృతి, బిఆర్ఎస్ పార్టీ వేరు వేరు కాదనీ, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు కలిసే పని చేస్తాయని స్పష్టం చేశారు.

సిబిఐటి ఇంజనీరింగ్ కాలేజీలో తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిబిఐటి ఇంజనీరింగ్ కాలేజీ నుంచి తొలగించిన ఆరుగురు నాన్‌టీచింగ్ ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీల నాన్‌టీచింగ్ స్టాఫ్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ డిమాండ్ చేశారు. జీతభత్యాలు పెంచాలని అడిగితే ఉద్యోగం నుంచి తొలగించడమేంటని ప్రశ్నించారు. ఇదే విషయంపై సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్మికశాఖ కార్యాలయంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ (రంగారెడ్డి జిల్లా)కు వినతిపత్రాన్ని అందజేశారు. జి.సంజీవ, పి.యాదగిరి, వి.యాదగిరి, అహ్మద్ బాసా, రమేశ్, శ్రీనివాస్‌లు 28 ఏళ్లుగా సిబిఐటిలో సేవలు అందించారని డిసిఎల్‌కు వివరించారు. దీనిపై ఉన్నతాధికారులకు, యజమాన్యానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. అన్నేళ్లు పనిచేసినవారిని ఏకపక్షంగా ఎలా తీసేస్తారని ప్రశ్నించారు. దీనికి డిసిఎల్ స్పందిస్తూ ఈ నెల 28న సిబిఐటి యాజమాన్యం, కార్మికులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారని తెలిపారు. ఆ సమావేశంలో యాజమాన్యం సానుకూలం స్పందించి 28 ఏండ్ల పాటు సిబిఐటిలోనే సేవలందించిన ఆరుగురు ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు.